www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 5 సెప్టెంబరు 2024
5



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 59 మంది ఎంపిక

డిఇఒ నాగమణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న 59 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.నాగమణి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ముగ్గురు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 26 మంది స్కూల్ అసిస్టెంట్లు, 24 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, సిఆర్ఎంటిలు ఇద్దరు, పిటిఐలు ముగ్గురు, ఐవిఆర్‌పి ఒకరు మొత్తం 59 మంది ఉత్తమ ఉపాధ్యాయ వార్డులకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. గురువారం నిర్వహించబోయే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

కొల్లేరుకు వరద

ఏలూరు-కైకలూరు రహదారిపైకి నీళ్లు - ఆందోళనలో లంక గ్రామాల ప్రజలు

వరద తగ్గేవరకు ఎవరూ బయటకు రావొద్దు - కలెక్టర్ కె.వెట్రిసెల్వి



నందిగాంలంకలో పడవపై జనం రాకపోకలు

ప్రజాశక్తి - మండవల్లి/కైకలూరు టౌన్

కొల్లేరు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లోని వరద నీరు కొల్లేరులో చేరడంతో ఉగ్రరూపం దాల్చుతోంది. ఇప్పటికే పెద్దఎడ్లగాడి-పెనుమాకలంక రహదారి జల దిగ్బంధంలో చిక్కుకోగా బుధవారం ఏలూరు-కైకలూరుపైకి సుమారు రెండు అడుగుల మేర వరద నీరు చేరింది. 2020లో కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల్లో నీరు కొల్లేరులోకి వచ్చి చేరడంతో కొల్లేటి నీటిమట్టం 3.9 మీటర్ల మేర నమోదైంది. దీంతో కొల్లేటి లంక గ్రామాలు పూర్తిస్థాయిలో జల దిగ్బంధనంలో చిక్కుకుపోవడంతో పడవలను ఏర్పాటు చేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రస్తుతం అదే తరహాలో కొల్లేరులోకి వరద నీరు చేరడంతో ఇంగిలంపాక నుండి నందిగామలంక వరకు సుమారు నాలుగు చోట్ల, నందిగామలంక నుండి పెనుమాక లంక వరకు మరో నాలుగు చోట్ల రహదారిపై నీరు చేరింది. వరద ఉధృతి కొనసాగితే కైకలూరు మండలంలోని పెదవడ్లపూడితిప్ప, పందిరిపల్లిగూడెం, కొల్లేటికోట, శృంగవరప్పాడు గ్రామాలు ముంపు బారిన పడే అవకాశం ఉంది. నందిగామలంకలోకి వరద నీరు చేరడంతో అక్కడి ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.

పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాం
ఇన్‌ఛార్జి తహశీల్దార్ గోపాల్

ఎగువ ప్రాంతాల నుండి వరద నీరు పెద్దఎత్తున వస్తోంది. దీంతో ఆ నీరు దిగువకు వెళ్లేలా పెద్దగాడివంతెన వద్ద గుర్రపుడెక్కను తొలగించాం. నందిగామలంక రహదారిపై రాకపోకలు నిలిపివేశాం. ప్రస్తుతం ఏలూరు-కైకలూరు రహదారిపై అడుగున్నర ఎత్తులో ముంపు నీరు ప్రవహిస్తోంది. అది మరింత పెరిగితే రాకపోకలకు అంతరాయం తప్పదు. ఎటువంటి సమస్య తలెత్తినా సహాయక చర్యలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాం.

బోట్లపై నిత్యావసర సరుకులు సరఫరా

కొల్లేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్‌పి, దెందులూరు ఎంఎల్ఎ

ఎడతెరిపి లేని కురుస్తున్న వర్షాలు, బుడమేరు తదితర వాగుల నుంచి వస్తున్న వరద ఉధృతితో కొల్లేరు వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. ఆమె బుధవారం దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్‌తో కలిసి ఏలూరు రూరల్ మండలం కోమటిలంక గ్రామం వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. అక్కడ ప్రజల సమస్యలను గ్రామ సర్పంచి, కొల్లేరు సరస్సు అధ్యక్షులు, గ్రామ పెద్దలు, ప్రజలు కలెక్టర్‌కు వివరించారు. కొల్లేరు వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోను రెండు రోజులపాటు గ్రామాల్లోని ఇళ్లలోనే ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో నిత్యావసర వస్తువులు సరఫరా చేయడానికి బోటును ప్రభుత్వం అనుమతిస్తుందన్నారు. దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కోమటిలంక రోడ్డు నిర్మాణానికి గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరు చేయించానని, అటవీశాఖ అనుమతులు లేనందున పనులు జరగలేదని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి పనులు ప్రారంభించాలని చింతమనేని కోరారు. ఆకివీడు సమీపంలో ఉప్పుటేరుపై రైల్వేట్రాక్ వద్ద గుర్రపుడెక్కను తొలగించడం ఉపయోగకరమన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఇరిగేషన్ శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ గ్రామాల్లో విఆర్‌ఒలతోపాటు పోలీస్ సిబ్బంది కూడా ప్రజలు బోట్లపై ప్రయాణించకుండా పర్యవేక్షిస్తారన్నారు. పెద్దఎడ్లగాడి, మలుగునూరు వంతెన వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పనులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, డిఎస్‌పి శ్రావణ్, సిఐ కృష్ణకుమార్, ఎస్ఐ రామచంద్రరావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ బండి ప్రణవి, ఇరిగేషన్, పోలీస్, అటవీ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కోమటిలంకలో పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

వరద గోదావరి

ఆందోళనలో లంక గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరికి వరద ఉధృతి పెరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి విడుదల చేస్తున్న నీటితో గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. బుధవారం సాయంత్రం నాటికి కోడేరు వద్ద గడిచిన 24 గంటల్లో మూడు అడుగులు మేర నీటిమట్టం పెరిగింది. ప్రస్తుతం లంక గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశించలేదు. వరద ఉధృతి ఇదేవిధంగా కొనసాగితే రెండు రోజుల్లో లంక గ్రామాలు ముంపుబారిన పడే ప్రమాదం ఉంది. ఇన్‌ఛార్జి తహశీల్దార్ డి.సుగుణసంధ్య, రెవెన్యూ అధికారులు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

పెనుగొండ: గోదావరి వరద ఉధృతిని పెనుగొండ సిఐ రజినీకుమార్, ఎస్ఐ గంగాధర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ లంక ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని, గోదావరిలో స్నానాలకు ఎవ్వరూ వెళ్లరాదని సూచించారు.



కోడేరు వద్ద ఉధృతంగా పెరుగుతున్న వశిష్ట గోదావరి



చించినాడ పుష్కర ఘాట్ వద్ద పెరుగుతున్న గోదావరి నీటి మట్టం

యలమంచిలి: ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న వరదతో బుధవారం గోదావరి నీటిమట్టం పెరిగింది. మండలంలోని బాడవ, చించినాడ, యలమంచిలి, యలమంచిలిలంక, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల పుష్కర ఘాట్ల వద్ద సుమారు రెండు అడుగుల మేర వరద నీరు పెరిగింది. కనకాయలంక కాజ్‌వేపైకి నీరొచ్చే ప్రమాదం ఉండటంతో అక్కడి ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

అధిక వర్షాలు, వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆమె జిల్లా అధికారులతో సమావేశమై రానున్న రెండు రోజుల్లో పొంచి ఉన్న ముప్పు నివారణకు ముందస్తు చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. గట్లు బలహీనంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి పటిష్ట పరచడానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. తూడు, కిక్కిస తొలగింపు పనులను వేగవంతం చేయాలన్నారు. ఎఇలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. పంచాయతీలు, పట్టణాల్లో పారిశుధ్య లోపాలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. క్లోరినేషన్ చేయకుండా ఎట్టి పరిస్థితుల్లో తాగునీరు సరఫరా చేయరాదని ఆదేశించారు. ప్రతి ఒక్క అధికారి, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలోనే ఉండాలని ఆదేశించారు. పంట పొలాల్లో ఇప్పటికే నిలిచి ఉన్న నీరును తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారికి సూచించారు. కాళ్ల మండలంలో, నరసాపురం మండలంలోని మల్లవరం, కొప్పర్రు వద్ద డ్రెయిన్లు ఆక్రమణలకు గురై నిడివి తగ్గడంతో నీటి ప్రవాహం సాఫీగా జరగడం లేదని జిల్లా వ్యవసాయాధికారి తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ బి.శివన్నారాయణరెడ్డి, నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ ఆనంద్, సిపిఒ ఎం.మోహనరావు, డిపిఒ విక్టర్, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, డిసిహెచ్ఎస్ సూర్యనారాయణ, జిల్లా ఇరిగేషన్ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్. వెంకటేశ్వరరావు, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి, ఇండస్ట్రీస్ అధికారి యు.మంగపతిరావు, జిల్లా అభివృద్ధి అధికారి డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి మురళీకృష్ణ, జిల్లా మత్స్యశాఖాధికారి ప్రసాద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఇళ్లు ఖాళీ చేయాలని కార్మికనగర్ వాసులకు నోటీసులు

సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి - ఆకివీడు

ఐ.భీమవరం రోడ్డులో బుధవారం సాయంత్రం ఒక్కసారి కలకలం రేగింది. కార్మికనగర్ వాసులు త్వరలో ఇళ్లు ఖాళీ చేయాలంటూ బుధవారం అధికారులు నోటీసులు ఇచ్చేందుకు వెళ్లారు. 52 మందిలో కొందరు నోటీసులు తీసుకున్నారు. మరికొందరు తీసుకోవడానికి నిరాకరించడంతో అధికారులు ఇంటి గోడలకు అంటించారు. దీంతో సిపిఎం ఆధ్వర్యాన రోడ్డుపై బైఠాయించి నోటీసులు వెనక్కి తీసుకోవాలంటూ నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు వారితో మాట్లాడారు. ఇప్పటికిప్పుడు ఇళ్లు ఖాళీ చేయమంటే వారు ఎక్కడికి వెళ్తారని, ఖాళీ చేయబోరని తెలిపారు. ప్రత్యామ్నాయ స్థలాలు చూపించి, ఇల్లు కట్టుకునేందుకు కనీసం ఆరు నెలలు సమయం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డోకల లక్ష్మి, సందక సూరిబాబు, బివి.వర్మ, బి.రాంబాబు, డోకల రవితేజ పాల్గొన్నారు.




రోడ్డుపై బైఠాయించిన కాలనీవాసులు

వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - ఆకివీడు

విజయవాడ వరద బాధితుల కోసం సిపిఎం విరాళాల సేకరణ చేపట్టింది. విజయవాడ వరద బాధితుల సహాయార్థం మంగళవారం పట్టణంలో సిపిఎం చేపట్టిన విరాళాల సేకరణకు ప్రజలు స్పందించి తమవంతు సాయం అందించారని నేతలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు కె.తవిటినాయుడు, డోకల రవితేజ, బివి.వర్మ, బొడ్డుపల్లి రాంబాబు, గేదెల ధనుష్, జి.ప్రసాద్, కె.గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నేతలు

వీడని వర్షం.. స్తంభించిన జనజీవనం

ప్రజాశక్తి - ఆచంట

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలో బుధవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ప్రజలు మధ్యాహ్నం వరకూ ఇళ్లకే పరిమితమయ్యారు. మధ్యాహ్నం నుంచి వాతావరణం కాస్త తెరిపించడంతో ప్రజలు, వాహనదారులు రోడ్డెక్కారు. మండలంలో సుమారు 30 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గ్రామాల్లో రోడ్లు డ్రెయినేజీలు తదితర సౌకర్యాలు లేక కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలో దాదాపు అన్ని కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. దశాబ్దాల కాలం నుంచి కాలనీవాసులు రహదారులు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరుతున్నా పట్టించుకునే నాథుడు లేడని వాపోతున్నారు. కొద్దిపాటి వర్షానికి కాలనీలు జలమలమవుతున్నాయి. రహదారులపై రోజుల తరబడి మురుగునీరు నిలిచిపోతోంది. దీంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా కాలనీవాసులు మురుగు డ్రెయిన్లలోని చెత్తాచెదారాన్ని స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నారు.

పెనుమంత్ర : మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. జనం బాబోయ్ ఇదేమి వర్షం అనిపించేలా వర్షం ఆగకుండా అదేపనిగా దంచి కొట్టింది. 42.06 మిల్లీమీటరల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు, అన్ని పాఠశాలలూ తెరవాలని మంగళవారం సాయంత్రం ప్రకటించారు. అయితే బుధవారం ఉదయం కురిసిన వర్షానికి పాఠశాలలు తెరుచుకున్నాక విద్యా శాఖ సెలవు ప్రకటించింది. దీంతో విద్యార్థులు తడుస్తూనే ఇళ్లకు తిరుగు ముఖం పట్టారు.



మొగల్తూరు జాతీయ రహదారిపై నిలిచిన వర్షపు నీరు

దెబ్బతిన్న రోడ్లు.. నిండు కుండల్లా డ్రెయిన్లు..

మండలంలోని మార్టేరు నుంచి పోడూరు రోడ్డు, పెనుమంత్ర వెళ్లే రోడ్డు పలు చోట్ల వర్షానికి గోతులు పడ్డాయి. పొలమూరు, నత్తా రామేశ్వరం, సోమరాజు ఇల్లింద్రపర్రు, మల్లిపూడి, సత్యవరం, కొయ్యేటిపాడు, వెలగలవారిపాలెం రోడ్లు చాలా వరకూ దెబ్బ తిన్నాయి. కురుస్తున్న వర్షాలకు గోస్తనీ, గొంతేరు, భగ్గేశ్వరం డ్రెయిన్లు నిండుకుండల్లా ఉన్నాయి.

మొగల్తూరు : బుధవారం తెల్లవారుజాము నుంచి మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చేపట్టిన పక్కా డ్రెయిన్ కాళీపట్నంలో అవుట్‌లెట్ ఏర్పాటు చేయలేదు. దీంతో రహదారి జలమయమైంది. ఈ నేపథ్యంలో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మొగల్తూరులోని హైస్కూల్ జలమయమైంది. ముక్కువారివీధి, సత్తమ్మ వీధి, పడమటి పాలెం, గొల్లగూడెం తదితర గ్రామాల్లో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోయింది.

విపత్కర పరిస్థితుల్లో అండగా ఉండటం అభినందనీయం

ప్రజాశక్తి - భీమవరం

విపత్కర పరిస్థితుల్లో పెద్ద మనసుతో అండగా ఉండడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా ముఖ్య ప్రణాళిక కార్యాలయ అధికారులు, సిబ్బంది జిల్లా కలెక్టర్‌ను కలిసి వరద బాధితుల సహాయార్థం రూ.1.21 లక్షల చెక్కును సిపిఒ ఎం.మోహన్‌రావు చేతుల మీదుగా అందజేశారు. ఉండి మండలం కలిగొట్ల గ్రామానికి చెందిన హైదరాబాద్ ఐఐసిటీలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన విశ్రాంత ఉద్యోగి సాగిరాజు వెంకట సత్యనారాయణ రాజు దాచుకున్న సేవింగ్స్ నుంచి రూ.50 వేల చెక్కును జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ వరద బాధితులకు ప్రతి ఒక్కరూ తోచిన రీతిలో సహాయం చేయడం సంతోషించదగిన విషయమన్నారు. చెక్కులు అందజేసిన వారికి, వారి కుటుంబ సభ్యులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. సిపిఒ కార్యాలయ అధికారులు, సిబ్బంది, సాగిరాజు వెంకట సత్యనారాయరాజు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ జె.ఉదయ భాస్కరరావు, సిపిఒ ఎం.మోహన్‌రావు, సిపిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహార పదార్థాలు పంపిణీ

చెక్కులు అందజేత



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న జిల్లా సిపిఒ కార్యాలయ అధికారులు, సిబ్బంది

కాళ్ల: వరద బాధితులకు ఆహారం అందించడంలో దాతలు దాతృత్వం మరువలేనిదని కాళ్ల ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఇ.నాగార్జున అన్నారు. బుధవారం సీసలిలో భోజనం తయారీ ప్యాకింగ్ పనులను, ఆహార నాణ్యతను ఇన్‌ఛార్జి తహశీల్దార్ నాగార్జున పరిశీలించారు. దొడ్డనపూడి గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు, సీసలి మాజీ సర్పంచి కట్రెడ్డి శ్రీనివాసరావు, జనసేన సీసలి గ్రామ అధ్యక్షులు నూకల భోగేంద్ర బాబు, టిడిపి, జనసేన సీసలి గ్రామ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, బిజెపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరా రామమూర్తి ఆర్థిక సహకారంతో 5 వేల భోజన ప్యాకెట్లు, 5 వేల వాటర్ ప్యాకెట్లను విజయవాడకు పంపించారు. వాటిని విజయవాడ తీసుకెళ్లే సంబంధిత వాహనాన్ని ఆర్‌డిఒ జెండా ఊపి ప్రారంభించారు. కాళ్ల ఇన్‌ఛార్జి తహశీల్దార్ నాగార్జున ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సహకారంతో వాటిని ప్రత్యేక వాహనంలో పంపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఆరేటి వెంకట రత్నప్రసాద్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎంఎస్ ప్రభాకర్, టిడిపి మండల అధ్యక్షులు జివి.నాగేశ్వరరావు, ఆరేటి పద్మారావు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : వరద బాధితుల కోసం బుధవారం జిల్లా నుంచి కలెక్టర్ చదలవాడ నాగరాణి పర్యవేక్షణలో పెద్ద ఎత్తున వేలాది ఆహార పొట్లాలు, వాటర్ బాటిల్స్ విజయవాడకు ప్రత్యేక వాహనాల్లో పంపించారు. ఈ సందర్భంగా ది భీమవరం ఆక్వా డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు వేల ఆహార పదార్థాలను జెపి రోడ్డులోని శ్రీభగవాన్ ట్రేడర్స్ కార్యాలయం వద్ద అసోసియేషన్ తరపున ఆహార పదార్థాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎంఎల్ఎ అంజిబాబు, జెసి రాహుల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. దాతలు ముందుకొచ్చి వరద బాధితులకు ఇటువంటి సహకారం అందించడం అభినందనీయమన్నారు. అనంతరం విజయవాడ పంపేందుకు జెండా ఊపి వాహనాన్ని కలెక్టర్, ఎంఎల్ఎ ప్రారంభించారు. కార్యక్రమంలో ది భీమవరం ఆక్వా డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నడింపల్లి వెంకట రామరాజు, కార్యదర్శి వేగేశ్న రమేష్‌రాజు, కడలి రమణ, వేస్పర్ వర్మ, వంశీ, అభిలాష్ వర్మ, జోగిరాజు, కిషోర్ రాజు పాల్గొన్నారు.



భీమవరం టౌన్ : ఎంఎల్ఎకు చెక్కు అందజేస్తున్న సభ్యులు

రూ.75 వేల చెక్కు అందజేత

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు అన్నారు. బుధవారం వరద బాధితుల సహాయార్థం కృష్ణ బలిజ టిడిపి బిసి రాష్ట్ర సాధికారిత కమిటీ సభ్యులు గంటా త్రిమూర్తులు ఆధ్వర్యంలో రూ.75 వేల సాయాన్ని ఎంఎల్ఎకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి, మద్దుల రాము, యలమంచిలి శ్రీను, మరపట్ల శ్యామ్ బాబు పాల్గొన్నారు.

ఉండి: ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించేందుకు పెదపుల్లేరు గ్రామస్తులు ఐక్యంగా ముందుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నాగరాణి సూచనల మేరకు తహశీల్దార్ నాగార్జున పర్యవేక్షణలో విజయవాడలోని వరద బాధితులకు రూ.రెండు లక్షల నిధులను సమీకరించి ఆరు వేల ఆహార పొట్లాలను తయారు చేయించామని, వాటిని రెవెన్యూ సిబ్బంది ద్వారా వరద బాధితుల కోసం తరలించామని తెలిపారు. ఈ మేరకు అందరికీ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

నరసాపురం: వరద బాధితులకు ఐఎంఎ, ఐడిఎ వైద్య స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. బుధవారం నరసాపురానికి చెందిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ), ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడిఎ) సంస్థలు సమకూర్చిన రూ.లక్ష చెక్కును ఐఎంఎ అధ్యక్ష కార్యదర్శులు బళ్ల మురళీ, నరసింహారావు, ఐడిఎ ప్రతినిధి పిఎస్ మూర్తి ఎంఎల్ఎకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడారు. టిడిపి రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి కొవ్వలి యతరాజా రామ్మోహన్ నాయుడు, డాక్టర్ మాదంశెట్టి కోటేశ్వరరావు పద్మావతి పాల్గొన్నారు.

ఆకివీడు : విజయవాడ వరద బాధితులకు టిడిపి ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు సరఫరా చేశారు. మూడు లారీల్లో పెరుగన్నం, సాంబార్ అన్నం, బిర్యానీ కలిపి మొత్తం 13 వేల ఆహార ప్యాకెట్లు, పదివేల వాటర్ బాటిళ్లు పంపించారు. సరఫరాకు ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు సహకరించారని చెప్పారు.

తాడేపల్లిగూడెం : విజయవాడ వరద బాధితులకు తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ తరుపున 20 బాక్సుల ఆహారం, నీరు, దుస్తులు పంపిణీ చేశారు. లయన్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో డైమండ్స్ టీం లయన్ దుర్గాప్రసాద్, లయన్ రమాదేవి, లయన్ మదన్‌మోహన్ అగర్వాల్, లయన్ రత్నకుమారి లయన్ కమల తదితరులు సుమారు 20 బాక్సుల ఆహారం, లయన్ ఆకుల సతీష్ 10 కేసుల వాటర్ బాటిళ్లు అందజేశారు. కో ఆర్డినేటర్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడారు.

అభివృద్ధికి ముందు వరసలో ఉంటా

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రజా అవసరాలను తీర్చేందుకు, అభివృద్ధి పర్చేందుకు తాను ఎప్పుడూ ముందు వరుసలో ఉంటానని ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘు రామకృష్ణంరాజు అన్నారు. పాలకోడేరు పిహెచ్‌సిలో అదనపు గదిని, రోగులకు ఉపయోగపడే విధంగా ఏర్పాటుచేసిన మరుగుదొడ్లను ఎంఎల్ఎ బుధవారం ప్రారంభించారు. అలాగే పశువుల ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పాలకోడేరు పిహెచ్‌సి డాక్టర్ సిహెచ్ వి.రంగం నాయుడు మాట్లాడుతూ ఎప్పటి నుంచో ఆసుపత్రి పైభాగాన నిర్మించిన అదనపు గది అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. ఇదే విషయాన్ని ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆయన స్పందించి నెల రోజుల్లో పూర్తిచేశారన్నారు. ఎంఎల్ఎ వెంట సొసైటీ బ్యాంకు మాజీ ఛైర్మన్ కొత్తపల్లి నాగరాజు, సర్పంచి ఇంజేటి మరియమ్మ, ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు)కు, నాది రాజు మురళీ కృష్ణంరాజు పాల్గొన్నారు.

విద్యుత్ ఉప కేంద్రంలో సిబ్బంది కొరత తీర్చాలి

తణుకు రూరల్: విద్యుత్ ఉపకేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణం భర్తీ చేయాలని సిపిఎం వేల్పూరు గ్రామ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా స్థానిక తణుకు విద్యుత్ డిఇఇ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు మాట్లాడుతూ తణుకు మండలంలోని వేల్పూరు విద్యుత్ కేంద్రం పరిధిలోని వేల్పూరు, మహాలక్ష్మిచెరువు, వీరభద్రపురం, కొమరవరం గ్రామాల్లో సుమారుగా 15 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని అందులో 10 వేలకు పైగా కనెక్షన్లు వేల్పూరు గ్రామానికి సంబంధించినవి తెలిపారు. విద్యుత్ కనెక్షన్లకు సిబ్బంది లేక అటు విద్యుత్ వినియోగదారులు ఇబ్బందిపడుతున్నారన్నారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శులు వాసా వెంకటేశ్వరరావు, తిరునాధం వెంకటేశ్వరరావు, అంబటి రామకృష్ణ, కుదకా వీరభద్రరావు, వాసా పోశయ్య, తాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

28 మంది ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

దేశ ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో 28 మంది వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఎంఎల్ఎ అంజిబాబు సత్కరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 28 మంది ఉపాధ్యాయులను సత్కరించి ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించామని తెలిపారు. వివిధ పాఠశాలల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈనెల 5న క్విట్ ఇండియా స్తూపం వద్ద బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పి.బాపిరాజు, ఎన్.మహేష్ కుమార్‌వర్మ, నందమూరి రాజేష్, గోపిశెట్టి మురళీకృష్ణ పాల్గొన్నారు.

వెంకటరెడ్డి నాయుడు సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - వీరవాసరం

సిపిఐ నాయకులు, మెంటేపూడి మాజీ సర్పంచి బోడపాటి వెంకటరెడ్డి నాయుడు వర్ధంతిని ఆయన స్వగ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ, ఎఐటియుసి కార్యదర్శి సిహెచ్.రంగారావు ముఖ్యఅతిథిగా పాల్గొని నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటరెడ్డి నాయుడు పార్టీకి, రైతాంగ ఉద్యమానికి చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శమన్నారు. బిజెపి జిల్లా కార్యదర్శి కురెళ్ల నరసింహారావు మాట్లాడుతూ నాయుడు సర్పంచిగా మెంటేపూడి గ్రామాభివృద్ధికి పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో బిపి నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీతలు వీరే

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈనెల 5వ తేదీన డాక్టర్ సర్వేపల్లి జయంతి, గురుపుజోత్సవం సందర్భంగా మండలంలోని ఆరుగురు ఉపాధ్యాయులకు జిల్లా ఎంపిక కమిటీ జిల్లా బెస్ట్ టీచర్ అవార్డులు ప్రకటించినట్లు ఎంఇఒ-1 యండమూరి లక్ష్మీనారాయణ, ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. ప్రధానోపాధ్యాయులు కేటగిరిలో ఆలమూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.సుబ్బారావు, స్కూల్ అసిస్టెంట్ కేటగిరిలో మాముడూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల మ్యాథ్స్ అసిస్టెంట్ పి.హరిబాబు, ఎస్‌జిటి కేటగిరిలో నెగ్గిపూడిలోని వనంపల్లి ప్రాథమిక పాఠశాల నుండి కోనాల నిర్మల, మల్లిపూడి ప్రాథమిక పాఠశాల నుంచి కె.సాయి రెడ్డి, వెలగలవారిపాలెం ప్రాథ మిక పాఠశాల నుంచి సిహెచ్‌వి. సత్యనారాయణ, పెనుమంట్ర ప్రాథమిక పాఠశాల నుంచి సిహెచ్‌విఎస్.హరిరాజా అవార్డులకు ఎంపికయ్యారని వారు పేర్కొన్నారు. వారికి ఈనెల 5వ తేదీ ఉదయం 8 గంటలకు భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే వేడుకలో ఈ అవార్డులు అందుకుంటారని తెలిపారు.



ఉపాధ్యాయిని కందాళ మంజుల

ఉత్తమ ఉపాధ్యాయినిగా మంజుల


గణపవరం: మండలంలోని కోమర్రు ఒకటో నంబరు పాఠశాలకు ఉపాధ్యాయిని కందాళ మంజుల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైనట్లు గణపవరం ఎంఇఒలు పుచ్చల శేషు, జి.బాలయ్య, బుధవారం తెలిపారు. మంజుల పాఠశాలలో వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం, నాడు-నేడు పనులు పూర్తి చేయడానికి సొంత సొమ్ములు వెచ్చించి పనులు పూర్తి చేయడంలో ఎనలేని కృషి చేశారని తెలిపారు. మంజులకు అవార్డు రావడం పట్ల మండల విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

బాల ఈశ్వరయ్యకు సత్కారం

తాడేపల్లిగూడెం : ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన భవిత వికలాంగుల పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కె.బాల ఈశ్వరయ్యను తాడేపల్లిగూడెం మానవత సేవా సంస్థ బుధవారం భవిత వికలాంగుల శిక్షణా కేంద్రంలో సన్మానించారు. మానవత అధ్యక్షులు పచ్చ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో వికలాంగ పిల్లలకు ఈశ్వరయ్య చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈశ్వరయ్య మాట్లాడారు. కార్యక్రమంలో యర్రా ఆంజనేయస్వామి, చేకూరి బంగార్రాజు, టి.పాండురంగారావు, జె.రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.



గునుపూడి బేబీ ప్రశాంతి



డివి.సత్యనారాయణ

కాళ్ల : మెండి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని గునుపూడి బేబీ ప్రశాంతి, బొండాడ చినపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డివి.సత్యనారాయణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైనట్లు ఎంఇఒ-1 ఎ.రవీంద్ర బుధవారం తెలిపారు. పాఠశాలల్లో నూతనంగా ఒకటో తరగతిలో చేరిన విద్యార్థుల కోసం నిర్దేశించిన విద్యా ప్రవేశ్ 90 రోజుల ప్రణాళిక అమల్లో భాగంగా ఈ ఏడాది జూన్ 23న సీసలి స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో టిఎంఎల్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో ఉపాధ్యాయిని బేబీ ప్రశాంతి బోధనోపకరణాలతో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించారు. ఆర్‌జెడి, జిల్లా విద్యాశాఖ ఇన్‌ఛార్జి జి.నాగమణిశ్రీ ప్రత్యేక అభినందనలు అందుకున్నారు. బొండాడ చినపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డివి.సత్యనారాయణ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి, పాఠశాలలో బోధనోపకరణలతో బోధన, దాతల సహకారంతో విద్యాసామగ్రి పంపిణీ, దేశ నాయకుల విగ్రహాల ఏర్పాటుకు కృషి చేశారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు, మొక్కలు పెంపకం, కోపల్లె యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో రూ.లక్ష ఆర్థిక సహకారంతో టాయిలెట్ సౌకర్యం ఏర్పాటుకు కృషి చేశారు. గునుపూడి బేబీ ప్రశాంతికి అవార్డు రావడం పట్ల ప్రధానోపాధ్యాయుడు కె.పవన్ కుమార్, బొండాడ చినపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డివి.సత్యనారాయణకు అవార్డు రావడం పట్ల మండల విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

మొక్కల పెంపకంతో పంచాయతీకి ఆదాయం

ప్రజాశక్తి - గణపవరం

పంచాయతీ పరిధిలో నాటిన మొక్కల ద్వారా వచ్చే ఆదాయం గ్రామాభివృద్ధికి ఉపయోగపడుతుందని జల్లి కాకినాడ సర్పంచి బాతు నాగేశ్వరరావు అన్నారు బుధవారం గ్రామంలో పలు చోట్ల కొబ్బరి మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో పాటు ఫలసాయంతో వచ్చే ఆదాయంతో గ్రామాభివృద్ధి పనులు పూర్తి చేయొచ్చన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కృషిచేస్తానని చెప్పారు.

సిపిఎం నుంచి అంజిబాబు బహిష్కరణ

ప్రజాశక్తి - ఆచంట

సిపిఎం క్రమశిక్షణకు, అనైతిక ప్రవర్తన విలువలు ప్రమాణాలకు భిన్నంగా దిగజారి ప్రవర్తిస్తున్న సిపిఎం మండల కమిటీ సభ్యులు వద్దిపర్తి అంజిబాబును సిపిఎం నుంచి బహిష్కరిస్తున్నట్లు సిపిఎం మండల కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇక నుంచి పార్టీ కార్యక్రమాలకు ఎటువంటి సంబంధం లేదని పేర్కొంది. సిపిఎం మండల కమిటీ సభ్యులుగా ఉంటూ వేరే పార్టీలోకి వెళ్లే ప్రయత్నాలు చేస్తున్న దృష్ట్యా పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ తరహాలో ఆయనపై వచ్చిన అభియోగాలు లోతుగా విచారణ జరిపి నిజనిర్ధారణ వచ్చిన తరువాతే ఈ చర్య తీసుకున్నట్లు మండల కమిటీ పేర్కొంది.

వైద్య శిబిరాలు పేదల పాలిట వరం

ప్రజాశక్తి - నరసాపురం

ఉచిత వైద్య శిబిరాలు పేదల పాలిట వరమని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడు అన్నారు. బుధవారం నరసాపురం అశ్వనీ ఆసుపత్రి నిర్వాహకులు మాధంశెట్టి కోటేశ్వరరావు పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో గ్రంధి విజయలక్ష్మి సత్యనారాయణ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉచిత మెగా కేన్సర్ నిర్ధారణా శిబిరాన్ని ఎంఎల్ఎ నాయకర్, కొవ్వలి రామ్మోహన్నాయుడు ప్రారంభించి మాట్లాడారు. నరసాపురం నియోజకవర్గ ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని అశ్వనీ ఆసుపత్రి నిర్వాహకులు పద్మావతి, కోటేశ్వరరావు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీమన్నారు. సమాజానికి 14 ఏళ్ల నుంచి డాక్టర్ పద్మావతి, ఆమె తల్లిదండ్రులు విజయలక్ష్మి, సత్యనారాయణ పేరుమీద వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 250 మందికి పైగా మహిళలకు పరీక్షలు చేసినట్లు పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో బళ్ల మురళి, నరసింహారావు, జ్యోతీరాణి, ఎల్.దేవీకృష్ణ, శేషుకుమారి, ఆర్.సుప్రియా పాల్గొన్నారు.

నరసాపురం : నరసాపురంలో ఈ నెల 5వ తేదీన వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్, లయన్స్ నేత్ర వైద్యశాల వారితో ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం నిర్వహిస్తున్నట్లు వాసవీ క్లబ్ అధ్యక్షుడు జల్లూరి శ్రీనివాస్ తెలిపారు. ఈ శిబిరంలో స్త్రీల సమస్యలు, దంత సమస్యలు, డయాబెటిక్ సమస్యలు, పురుషుల సమస్యల నిమిత్తం అనుభవజ్ఞులైన వైద్యులచే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అన్నారు. నరసాపురంలో వైఎన్ కళాశాల ఎదురుగా ఉన్న అప్పన ప్లాజాలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ శిబిరం కొనసాగుతుందన్నారు.

పూర్ణచంద్రరావు మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వైసిపి సీనియర్ నాయకులు, మాజీ వైస్ ఎంపిపి రేపు పూర్ణచంద్రరావు మృతి పార్టీకి తీరనిలోటని మాజీ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. దొంగపిండి గ్రామంలో ఆయన స్వగృహంలో పూర్ణచంద్రరావు చిత్రపటానికి శ్రీనివాస్ బుధవారం పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు పాల్గొన్నారు.

ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ గడువు పెంచాలని వినతి

ప్రజాశక్తి - భీమవరం

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల ఓటర్ ఎన్రోల్మెంట్ గడువు పెంచాలని రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం, ప్రధాన కార్యదర్శి బివి.నారాయణ కోరారు. కలెక్టరేట్లో బుధవారం జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో వారంరోజుల నుంచి భారీ వర్షాలు కురవడం, ప్రభుత్వం స్కూళ్లకు సెలవు ప్రకటించడంతో ఉపాధ్యాయులు ఓటర్ నమోదు అప్లికేషన్లను రెవెన్యూ కార్యాలయాల్లో సమర్పించలేకపోయారన్నారు. ప్రభుత్వం వారం రోజులు సమయం పెంచాలని డిమాండ్ చేశారు.

14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - తణుకు

రాజీయే రాజ మార్గమని, కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకుని విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి సూచించారు. బుధవారం స్థానిక తణుకు కోర్టు ప్రాంగణంలో ఈ నెల 14వ తేదీ శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవాలని జిల్లా జడ్జి సత్యవతి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ తణుకు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని తెలిపారు. దానిలో రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్, బ్యాంక్ బకాయి, యాక్సిడెంట్ కేసులు, ఎంసి, డివిసి కేసులు కక్షిదారులు రాజీ చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజూ కోర్టులో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నారని, దానిలో కూడా కేసులు రాజీ చేసుకోవాలని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మీడియేషన్ కేసులు రాజీ చేస్తున్నారని, దాన్ని కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వంద మందికి ఆహారం పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నిరాశ్రయులై రోడ్డు పక్కన ఉన్న 100 మందికి ఆహారం అందజేశారు. పాలకొల్లు అగ్నిమాపక శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బివి.రమణ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నాడు. ఇటీవల శీతాకాలంలో కూడా 100 మంది పేదలకు రగ్గులు పంచిపెట్టి, భోజనాలు పెట్టారు. తన స్వగ్రామం పెనుగొండ మండలం ములపర్రులో వైద్య శిబిరాలు పెడుతూ పేదలకు సేవలందిస్తూ సొంతంగా రూ.8 లక్షలతో కైలాస రథం, ఫ్రీజర్ బాక్స్, ఎలక్ట్రికల్ ఆక్సిజన్ కాన్సెంట్రేటర్, హాస్పిటల్ అత్యవసరాలకు ఉపయోగించేందుకు టూ వీలర్ మోటార్ సైకిల్‌ను అందజేవారు. అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న రమణను ఆర్‌డిఒ ఎంఎ అంబరీష్ ఇటీవల సత్కరించారు.

మట్టి విగ్రహాల పంపిణీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వినాయక చవితి వేడుకలకు మట్టి విగ్రహాలను ఉచితంగా అందించడం అభినందనీయమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో డిఎన్ఆర్ కళాశాల రోడ్డు తాడిమళ్లగిరి కాంప్లెక్స్ వద్ద మట్టి గణపతి విగ్రహాలు, వ్రత పుస్తకం, పండ్లు ఎంఎల్ఎ అందజేశారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ పర్యావరణ హిత గణేశ్ విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రముఖ న్యాయవాది తాళిమాళ్ల గిరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలను వాడాలన్నారు. కార్యక్రమంలో తుపాన్ బాధితుల సహాయ నిధికి తాడిమళ్ల గిరి రూ.50,000 విరాళం చెక్కు అందజేశారు. మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, పిఆర్‌ఒ భట్టిప్రోలు శ్రీనివాసరావు, కారుమూరి సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

నరసాపురం : నరసాపురంలో కాపు వనితా క్లబ్ ఆధ్వర్యంలో వినాయకుని మట్టి ప్రతిమల పంపిణీ చేశారు. బుధవారం స్థానిక బాలగణపతి ఆలయం వద్ద వనితా క్లబ్ ఉపాధ్యక్షురాలు పిప్పళ్ల సుప్రజ సౌజన్యంతో 200 వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, వనితాక్లబ్ రీజనల్ ఛైర్ పర్సన్ రాజ్యలక్ష్మి శిరిగినీడి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి బండి స్వర్ణలత, ఉపాధ్యక్షురాలు పుష్పాల ఉషాకమల, భారతి పాల్గొన్నారు.